
సాక్షి
పల్నాడు
శుక్రవారం । 23 । ఆగస్టు । 2024



యల్లమ్మ తల్లి కొలుపులు

వెల్దుర్తి: గుండ్లపాడు గ్రామంలోని యల్లమ్మ తల్లి కొలుపులలో భాగంగా గురువారం బుట్ట బంగారం మట్టిని తీసుకొచ్చారు. ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 589.00 అడుగుల వద్ద ఉంది.కుడి కాలువకు 8,280 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ



పాతనందాయపాలెం(కర్లపాలెం): గ్రామంలోని కుంచాలవారి ఇలవేల్పు శ్రీ పెద అంకమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ గురువారం అత్యంత వైభవంగా జరిగింది. అనంతరం విఘ్నేశ్వరుడు, పోతురాజు, నాగదేవత విగ్రహాలనూ ప్రతిష్ఠించారు. బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు పూజలు చేశారు.

న్యూస్‌రీల్

విఘ్నేశ్వరునికి పూజలు



అమరావతి: అమరావతి అమరేశ్వరాలయంలోని విఘ్నేశ్వరస్వామి ఉపాలయంలో గురువారం సంకటహర చతుర్థి పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకస్వామి జగర్లపూడి శేషసాయిశర్మ విఘ్నేశ్వర స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. స్వామి వారికి వివిధ రకాల పుష్పాలు, గరికెతో విశేషాలంకారం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి ఉండ్రాళ్లు సమర్పించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

కానిస్టేబుళ్లకు ఎస్పీ అభినందనలు



నరసరావుపేట: ఇటీవల వినుకొండ బొల్లాపల్లి ప్రాంతంలో వైఎస్సార్ సీపీ నాయకుడి కిడ్నాప్ కేసులో చాకచక్యంగా వ్యవహరించి నిందితులను పట్టుకోవటం ప్రతిభ చూపించిన ఇరువురు కానిస్టేబుళ్లను జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు అభినందించారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో బొల్లాపల్లి పోలీసుస్టేషన్‌లో పనిచేస్తున్న షేక్ నిజాముద్దీన్, బి.తిరుపతిలకు షీల్డు అందజేశారు.

నిదానంపాటి అమ్మవారి హుండీ ఆదాయం రూ.16 లక్షలు




దుర్గి: అడిగొప్పలలోని నిదానంపాటి శ్రీ లక్ష్మీ అమ్మవారి హుండీ కానుకలు లెక్కించగా రూ. 16,91,790 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి సైదమ్మ బాయి, వ్యవస్థాపక ధర్మకర్త యాగంటి వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో కారంపూడి గ్రూప్ టెంపుల్స్ కార్యనిర్వహణాధికారి పప్పుల కృష్ణంరాజు ఆధ్వర్యంలో 30 రోజులపాటు భక్తులు అమ్మవారికి సమర్పించిన హుండీ లెక్కింపు చేపట్టారు. కానుకల రూపంలో వచ్చిన ఆదాయాన్ని బ్యాంకు అధికారులకు అందజేసి సంబంధిత రసీదును తీసుకున్నట్లు అధికారులకు వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎంఆర్ సిబ్బంది, అర్చక, పరిచారక, నాయీ బ్రాహ్మణులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

విజయకీలాద్రిపై తిరునక్షత్ర మహోత్సవం



తాడేపల్లి రూరల్ : ఎంటీఎంసీ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై తిరునక్షత్ర మహోత్సవాల్ని గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్‌స్వామి మంగళా శాసనాలతో శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ పెద్ద జీయర్ స్వామి తిరునక్షత్ర మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించామని తెలిపారు. ఉదయం 9 గంటలకు పెద్ద జీయర్‌స్వామికి అభిషేకం (తిరుమంజనం), 10:30 గంటలకు అష్టోత్తర శతనామార్చన చేశామని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారని ఆయన తెలియజేశారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లి రూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 8004 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 340, బ్యాంక్ కెనాల్‌కు 1861, తూర్పు కెనాల్‌కు 761, పశ్చిమ కెనాల్‌కు 250, నిజాంపట్నం కాలువకు 490, కొమ్మమూరు కాలువకు 3120 క్యూసెక్కులు విడుదల చేశారు.

తెల్లకోటుకు భద్రత ఏదీ?

- కోల్‌కతా మెడికో హత్యాచార ఘటన నేపథ్యంలో మహిళా డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది ఆందోళన
- అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్
- మన ఆసుపత్రుల్లో భద్రతపై సమీక్షించాలని విన్నపం
- నరసరావుపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో కనిపించని భద్రతా చర్యలు
- రాత్రి వేళ తాగి గొడవలు చేస్తున్న రోగి తరపు బంధువులు
- మహిళా డాక్టర్లు, నర్సులకు అందుబాటులో లేని కనీస సౌకర్యాలు

పదిహేను రోజుల కిందట నరసరావుపేట పల్నాడు బస్టాండ్ రోడ్డులోని ప్రభుత్వ ఆసుపత్రి గైనకాలజీ వార్డులో చికిత్స పొందుతున్న ఓ గర్భిణికి అర్ధరాత్రి సమయంలో బిడ్డ అడ్డం తిరగడంతో సర్జరీ చేయాల్సి వచ్చింది. అనుమతి కోసం డాక్టర్లు ఆమె భర్తను పిలిపించారు. భార్యాభర్తల మధ్య గొడవలు ఉండటం, అప్పటికే ఆయన పూటుగా తాగి ఉండటంతో నానా హంగామా చేశాడు. నా భార్యకు మీరు చికిత్స చేయొద్దు మేము వెళ్లిపోతామంటూ డ్యూటీలో ఉన్న మహిళా డాక్టర్లు, నర్సింగ్ సిబ్బందిపై దౌర్జన్యం చేశాడు. ఆసుపత్రిలో పోలీస్ అవుట్ పోస్టు లేకపోవడం, ఆ సమయంలో ప్రైవేట్ సెక్యూరిటీ కనిపించకపోవడంతో వైద్య సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. డాక్టర్ అనుమతి లేకుండానే దౌర్జన్యంగా గర్భిణిని తీసుకువెళ్లాడు. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం జరిగిన ఘటన నేపథ్యంలో మన ఆసుపత్రుల్లో భద్రతపై సమీక్షించాలని మహిళా వైద్య సిబ్బంది విన్నపిస్తున్నారు.

సాక్షి విజిట్

నరసరావుపేట లింగంగుంట్లలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాల భవనం



సాక్షి, నరసరావుపేట: అమ్మ జన్మనిస్తే .. వైద్యులు పునర్జన్మనిస్తారంటారు. అమ్మ తరువాత అంతటి విలువనిచ్చే వైద్య వృత్తిలో ప్రవేశించాలంటే వనితలు వణికిపోతున్నారు. సమాజంలో విలువ, ఉద్యోగం దేవుడెరుగు మాన, ప్రాణాలకు కూడా రక్షణ లేకుండా పోతోందని మహిళా వైద్య సిబ్బంది ఆవేదన చెందుతున్నారు. నిత్యం ఏదో ఒకచోట దాడులు, అఘాయిత్యాలు వంటి దారుణాలు జరిగినప్పుడు హడావుడి చేయడం మినహా ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది భద్రతకు అవసరమైన చర్యలు తీసుకోవడంలో అలసత్వం కమ్ముకుంటోంది. తాజాగా కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ ఆసుపత్రిలో మహిళా ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారం జరిగిన నేపథ్యంలో ఎక్కడో కోల్‌కతాలో మాత్రమే కాదు.. మన నరసరావుపేటలో మహిళా వైద్య సిబ్బందికి ఏమాత్రం భద్రత ఉందో కూడా సమీక్షించాలని వారు కోరుతున్నారు.

ప్రైవేట్ సెక్యూరిటీతో సరి

ఆస్పత్రిలో సెక్యూరిటీ విభాగాన్ని ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించారు. తగినంత మంది సిబ్బంది ఉండడం లేదు. ఒకరిద్దరు ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది మాత్రమే ఉంటున్నారు. సెక్యూరిటీ ఏజెన్సీ ఆ రోజు విధుల్లోకి ఎవర్ని పంపారు, ఆయన వచ్చారా లేదా అన్న వివరాలు ఆసుపత్రి వర్గాలకు తెలియకపోవడంతో సమన్వయం కొరవడుతోంది. ఏదైనా సమస్య వస్తే పరిష్కరించడం వారి వల్ల కావడం లేదని వైద్య సిబ్బంది తెలిపారు.

కనిపించని పోలీసు అవుట్ పోస్టు

నరసరావుపేటలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలను 200 పడకలకు ఉన్నతీకరించారు. నిత్యం వందలాది మంది వైద్యం కోసం వచ్చే రోగులకు వైద్యం అందించేందుకు 24 గంటలు వైద్య సిబ్బంది విధులు నిర్వహించాల్సి వస్తోంది. లింగంగుంట్ల, పల్నాడు రోడ్డులోని పాత ఆసుపత్రిలో సుమారు 50 మంది మహిళా వైద్యులు, నర్సులు పనిచేస్తున్నారు. వీరికి అదనంగా నర్సింగ్ విద్యార్థినులు శిక్షణ పొందుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళలో అత్యవసర వైద్య సేవల నిమిత్తం వచ్చే రోగుల బంధువులు, కొంతమంది తాగుబోతులతో ఇబ్బందికర వాతావరణం ఉంటోందని వైద్యులు వాపోతున్నారు. పరిస్థితి చేయి దాటినప్పుడు చెప్పడానికి పోలీసు అవుట్ పోస్టు లేకపోవడంతో ఇబ్బందిగా ఉంటోందంటున్నారు. పోలీసు అవుట్ పోస్టు ఉంటే కొంత మాకు రక్షణగా ఉంటుందని, వెంటనే అవుట్ పోస్టు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

దేవుడిపై భారం వేసి పనిచేస్తున్నాం...



కోల్‌కతా ఘటన హేయమైన చర్య. అటువంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలి. ఏరియా వైద్యశాల పక్కనే కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలు ఉన్నా భయం గా ఉంది. పోలీసు అవుట్ పోస్టు ఏర్పాటు చేస్తే మాకు కొంత ధైర్యంగా ఉంటుంది. రాత్రి సమయంలో ఆసుపత్రి నుంచి రోడ్డుపైకి వచ్చే దారిలో లైట్లు, సీసీ కెమెరాలు లేకపోవడం ఇబ్బందిగా ఉంది. మూడు ఫ్లోర్లకుగాను ఓ ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది ఉంటున్నారు. దేవుడిపై భారం వేసి విధులు నిర్వహిస్తున్నాం.

–ఎం జయకరుణ, నర్సింగ్ సూపరింటెండెంట్

అరకొర సౌకర్యాలు

మరోవైపు మహిళా డాక్టర్లు, నర్సింగ్ సిబ్బందికి ఆస్పత్రిలో అరకొర సౌకర్యాలు ఉన్నాయి. వారికి సరిపడా వాష్‌రూంలు లేవు. దీంతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యేకంగా వేచి ఉండే గదులు లేవు. ఫలితంగా ఓపీ విభాగంలోనే పడిగాపులు పడుతున్నారు. జబ్బుల వ్యాప్తి నుంచి రక్షణకు తగిన శానిటైజేషన్ వస్తువులు అందుబాటులో లేవు. కనీస సౌకర్యాలు కల్పించాలని వారు కోరుతున్నారు.

నైట్ డ్యూటీల భారం

లింగంగుంట్లలోని ఏరియా ఆస్పత్రిలో 40 మంది నర్సింగ్ సిబ్బంది ఉండాల్సి ఉంది. కేవలం 16 మంది మాత్రమే ఉన్నారు. దీంతో పనిభారం పెరగడంతోపాటు నైట్ డ్యూటీలు ఎక్కువ చేయాల్సి వస్తోంది. రాత్రి సమయంలో సరైన రక్షణ లేకపోవడంతో వీరు భయాందోళనకు గురవుతున్నారు.

నామమాత్రంగా సీసీ కెమెరాలు

ప్రభుత్వ ఆసుపత్రుల్లో సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ అవి కేవలం ఎమర్జెన్సీ వార్డులకే పరిమితమవుతున్నాయి. ఆసుపత్రి పరిసరాలు, క్యాంటీన్లు, గేటు బయట మాత్రం కనిపించడం లేదు. రాత్రి పూట ఆయా చోట్ల విధుల్లో ఉన్న మహిళా వైద్య సిబ్బంది సంచరించడం ప్రమాదకరంగా మారింది. లింగంగుంట్ల ఆసుపత్రి నుంచి మెయిన్ రోడ్డుపైకి వచ్చే దారిలో సీసీ కెమెరాలు లేవు. రాత్రి పూట విధులు పూర్తిచేసుకొని రోడ్డుపైకి వచ్చే వైద్య సిబ్బందికి అక్కడ రక్షణ కరవవుతోంది. రాత్రి పూట కరెంట్ పోతే జనరేటర్లు వేయడకపోవడంతో అంధకారం నెలకొంటోంది. ఆ సమయంలో విధులకు వెళ్లడం మహిళా సిబ్బందికి ఇబ్బందికరంగా మారింది.

తాగి గొడవ చేసే వారితో ఇబ్బంది



రాత్రిపూట విధులు నిర్వర్తించే వైద్య సిబ్బందికి తాగి వచ్చే రోగుల బంధువులతో ఇబ్బందిగా ఉంటోంది. అనవసరంగా గొడవలు చేస్తున్నారు. పోలీసు అవుట్‌పోస్టు ఉంటే మాకు ఆ సమయంలో కొంత రక్షణగా ఉంటుంది. సరిపడా భద్రతా సిబ్బంది ఉండాలి. అప్పుడే కోల్‌కతా తరహా ఘటనలు జరిగే అవకాశం ఉండదు. ఆసుపత్రిలో కొన్ని మౌలిక వసతులు కల్పించాల్సి ఉంది.

–డాక్టర్ సౌజన్య, గైనకాలజిస్టు, నరసరావుపేట ప్రభుత్వ ఏరియా వైద్యశాల.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి...



ప్రభుత్వ ఆసుపత్రిలో సరైన రక్షణ చర్యలు లేవు, రాత్రి పూట విధులు నిర్వర్తించే వారికి ఇబ్బందికర వాతావరణం నెలకొంది. రోగి వెంట 10 నుంచి 15 మంది బంధువులు గుంపుగా వస్తున్నారు. ఎవరు ఏంటో తెలియడం లేదు. ఆసుపత్రిలో అన్నిచోట్లా సీసీ కెమెరాలు లేవు. దీంతో మహిళా వైద్య సిబ్బందికే కాదు, ఇక్కడ పుట్టే చిన్నారుల భద్రత ప్రశ్నార్థకంగా ఉంది.

–డాక్టర్ డి.సుష్మ, గైనకాలజిస్టు, నరసరావుపేట ప్రభుత్వ ఏరియా వైద్యశాల.

హోం మినిస్టర్ మా సమస్యను అర్థం చేసుకోవాలి...



కోల్‌కతా తరహా ఘటనలు జరిగినప్పుడు 10 రోజులు హడావుడి చేసి మరచిపోతున్నారు. మహిళా హోం మంత్రిగా ఉన్న మన రాష్ట్రంలో మహిళా వైద్య సిబ్బంది భద్రతకు అవసరమైన చట్టాలు తెచ్చి పక్కాగా అమలు చేయాలి. అప్పుడే దాడులు తగ్గుముఖం పడతాయి. 40 మంది ఉండాల్సిన చోట కేవలం 16 మంది ఉండటంతో పనిభారం పెరిగి నైట్ డ్యూటీలు ఎక్కువ చేయాల్సి వస్తోంది.

–కోటమ్మ, హెడ్ నర్స్, నరసరావుపేట ప్రభుత్వ ఏరియా వైద్యశాల

కోల్‌కతా ఉదంతంపై న్యాయవాదుల ఆందోళన



కోల్‌కతా డాక్టర్ ఉదంతంపై ఆందోళన నిర్వహిస్తున్న న్యాయవాదులు

నరసరావుపేటటౌన్: స్వాతంత్య్రం వచ్చి 78 సంవత్సరాలు గడుస్తున్నా మహిళలకు రక్షణ లేకుండా పోయిందని న్యాయవాద సంఘ అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరావు అన్నారు. కోల్‌కతా డాక్టర్ హత్యాచారం, ఘటనను నిరసిస్తూ న్యాయవాద సంఘం ఆధ్వర్యంలో గురువారం న్యాయవాదులు ఆందోళన నిర్వహించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. కోల్‌కతా లాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. న్యాయవాది సలీం మాట్లాడుతూ వైద్యురాలిపై జరిగిన సంఘటన దిగ్భ్రాంతి కరమైన విషయమన్నారు. పని ప్రదేశాల్లో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. దేశంలో మహిళల కోసం సరైన భద్రతా చట్టాలను తీసుకురావాలని డిమాండ్ చేశారు. మొదట మహిళా న్యాయవాదులు కోర్టు ప్రాంగణంలోని న్యాయదేవత విగ్రహం వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు కొండా సాంబశివరావు, చక్రపాణి, రాజేశ్వరరావు, అమూల్య, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పద్ధతిలో గ్రామసభలు

- జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు
- అధికారులతో సమీక్ష



క్యాంపు కార్యాలయంలో తన తల్లిపేరుతో మొక్క నాటుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈనెల 23న ప్రారంభించనున్న గ్రామసభలను జిల్లాలోని అన్నీ గ్రామపంచాయతీల్లో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. గ్రామసభల సంసిద్ధతపై కలెక్టరేట్ నుంచి గురువారం జిల్లా అధికారులతో టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ప్రతి గ్రామంలో ప్రజాస్వామ్య పద్ధతిలో గ్రామసభలు నిర్వహించి గ్రామాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. అధికారులతోపాటు స్థానిక ప్రజాప్రతినిధులు, సామాజిక బాధ్యత వహించే ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేయాలన్నారు. గ్రామాల్లో అవసరాలను గుర్తించడం, అందుకు తగ్గ అభివృద్ధి పనుల నిర్వహణ కోసం ప్రణాళికలు రూపొందించుకుని గ్రామస్తుల సమక్షంలో ఆమోదించడం జరుగుతుందన్నారు. 2024–25 ఆర్థిక ఏడాదిలో చేపట్టే అభివృద్ధి పనుల గుర్తింపు–ప్రణాళికా ప్రక్రియను రూపొందించుకునేందుకు గ్రామ సర్పంచ్ అధ్యక్షతన ప్రతి గ్రామ పంచాయతీలో గ్రామసభలను నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. సభలు పూర్తయిన వెంటనే ప్రభుత్వం రూపొందించిన ఈఎంఎంఎస్ యాప్ ద్వారా ఫొటోలు, వీడియోలు, సంబంధిత మినిట్స్ నోట్ డాక్యుమెంట్లు అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు.

ప్రతి కుటుంబానికీ 100 రోజుల పని

గ్రామ పంచాయతీలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా గ్రామంలో మౌలిక సదుపాయాలను కల్పించుకునే ఉద్దేశంతో గ్రామంలో ప్రతి కుటుంబానికీ 100 రోజుల ఉపాధి హామీ పనిని కల్పించడంపై గ్రామసభలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో కనీస సదుపాయల్లో భాగంగా ప్రతి ఇంటికి, ఇంటింటికి తాగునీటి సరఫరాలో ఎక్కడా అంతరాయం లేకుండా పనులు చేపట్టాలని సూచించారు. అక్టోబర్ రెండు నుంచి ప్రారంభం కానున్న నూతన గృహ నిర్మాణాల్లో ప్రతి ఇంటికి ఖచ్చితంగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో గ్రామ ప్రజలే సమష్టిగా ముందుకు సాగాలని సూచించారు. తల్లిపేరుతో ప్రతి ఒక్కరూ మొక్క నాటే కార్యక్రమంలో భాగంగా క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ తన తల్లి పేరుతో మొక్కను నాటారు.

పీఎం విశ్వకర్మ యోజన దరఖాస్తుల పరిశీలన పూర్తిచేయండి

ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం దరఖాస్తుల పరిశీలన వారాంతంలోగా పూర్తిచేయాలని పరిశ్రమ శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌కుమార్ ఆదేశించారు. రెండోదశ పరిశీలనకు అందిన 32,848 దరఖాస్తుల పరిశీలన శనివారంలోగా పూర్తి చేయాలన్నారు. మొదటి దశలో పెండింగులో ఉన్న మరో 12,952 దరఖాస్తుల పరిశీలనను ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ల సమన్వయంతో పూర్తిచేయాలన్నారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన ద్వారా సబ్సిడీలు అందిస్తామనే అపోహలపై జిల్లా కలెక్టర్ స్పష్టత ఇచ్చారు. ఐదు శాతం వడ్డీతో బ్యాంకుల ద్వారా రుణం మంజూరు చేస్తామని తెలిపారు. జిల్లా పరిశ్రమల అధికారి (ఇన్‌చార్జి) సుధాకర్, డీఆర్‌డీఏ పీడీ బాలునాయక్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సంజీవ్‌రావు, జిల్లా గ్రామ–వార్డు సచివాలయాల నోడల్ అధికారి వెంకట్‌రెడ్డి, ఎల్డీఎం రాంప్రసాద్, డీపీఆర్వో ఓంప్రకాశ్‌రెడ్డి, విశ్వకర్మ రంగం నిపుణులు వెంకటేశ్వర్లు, జీ.కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

బుక్ చేసుకున్న రసీదుతో వచ్చేవారికే అనుమతి

నరసరావుపేట: ఉచిత ఇసుక విధానంలో ఇసుక కావాల్సిన వ్యక్తులు ముందుగా తమ దగ్గరలోని సచివాలయంలో బుక్ చేసుకొని వారికి నిర్దేశించిన సమయంలో ఆ రసీదు తీసుకొని వచ్చే వారినే ర్యాంపు వద్దకు అనుమతిస్తామని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు, ఎస్పీ కె.శ్రీనివాసరావు స్పష్టం చేశారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం మాదిపాడు, కొండమోడు ర్యాంపుల్లోనే ఇసుక ఉందని చెప్పారు. భవిష్యత్ అవసరాలకు మరో ఐదు ర్యాంపులు గుర్తించామని, ఇసుకకు ఎక్కడా కొరత లేదని చెప్పారు. అక్రమాలకు తావు లేకుండా ఇసుక పారదర్శకంగా అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోలీసులు, రవాణాశాఖ అధికారులు వాహనాల వ్యక్తులు ముందుగానే బుక్‌చేసుకున్నారా లేదా అనేది పరిశీలించి అనుమతిస్తారన్నారు. లోడింగ్ సమయంలో బుక్ చేసుకున్న మేరకే ఇసుక లోడు చేస్తున్నారా లేదా అనేది మరో అధికారి పరిశీలిస్తారన్నారు. ప్రభుత్వం ఇసుక ఉచితంగా ఇస్తున్నా రవాణా చార్జీల వల్ల ధర పెరిగిందనే భావన ప్రజల్లో ఉందన్నారు. దీనికి నోడల్ ఆఫీసర్‌గా జేసీ సూరజ్ ధనుంజయ్‌ను ప్రభుత్వం నియమించిందన్నారు. ఇసుక అక్రమంగా నిల్వ చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం సెప్టెంబరు 11వ తేదీన నూతన ఇసుక పాలసీ తీసుకురానుందని అన్నారు. అప్పటి నుంచి ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరుగంటల్లోపు ఇసుక తరలింపుకు అనుమతిస్తామని తెలిపారు. జేసీ సూరజ్ ధనుంజయ్ పాల్గొన్నారు.

భావితరాలకు కళాసంపద అందించాలి



కథక్ నత్యరూపకాన్ని విద్యార్థులకు నేర్పిస్తున్న జాతీయ అవార్డు గ్రహీత రాఘవరాజ్‌భట్

- కథక్ నృత్య జాతీయ అవార్డు గ్రహీత రాఘవరాజ్ భట్
- కేంద్ర సంగీత్, నాటక అకాడమీ ఆధ్వర్యాన కథక్‌పై శిక్షణ
- ఏపీలో తొలిగా శిబిరం నిర్వహణ

చిలకలూరిపేటటౌన్: తరతరాలుగా వారసత్వంగా వస్తున్న భారతీయ కళా సంపదను భావితరాలకు అందించాల్సిన ఆవశ్యకత దేశపౌరులు అందరిదని కథక్ నృత్య జాతీయ అవార్డు గ్రహీత రాఘవ రాజ్‌భట్ పేర్కొన్నారు. చిలకలూరిపేట మండలం మద్దిరాలలోని పీఎంశ్రీ జవహర్ నవోదయ విద్యాలయంలో కళాదరోహర్ కార్యక్రమం నిర్వహించారు. దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన నాలుగు విద్యాలయాల్లో మద్దిరాల జేఎన్‌వీ ఒకటి కావడం విశేషం. 16వ శతాబ్దానికి చెందిన కవయిత్రి మీరాబాయి జయంతిని పురస్కరించుకుని కథక్ ప్రదర్శనపై రెండు రోజుల వర్క్‌షాపు ఏర్పాటు చేశారు. కేంద్ర సంగీత, నాటక అకాడమీ ఆధ్వర్యాన కథక్ నృత్య ప్రదర్శనపై ఆయన తోటి కళాకారులతో కలిసి మద్దిరాల జేఎన్‌వీ విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. గురువారం సాయంత్రం ముగింపు సమావేశం జరిగింది. జేఎన్‌వీ ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహారావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో రాఘవ రాజ్‌భట్ మాట్లాడుతూ భారతీయ శాస్త్రీయ నృత్య అష్ట రూపాల్లో కథక్ ఒకటన్నారు. ఇది ఉత్తరప్రదేశ్‌కు చెందిన శాస్త్రీయ నృత్యరూపమని తెలియజేశారు. పురాణాలు, ఇతిహాసాల కాలంలోనే మనదేశంలో కథక్ కళ పురుడు పోసుకుందన్నారు. భారత సంస్కృతి, సాంప్రదాయాలకు వారధులు నాటి కళలే అన్నారు. ప్రస్తుతం పాశ్చాత్య ప్రవాహంలో భారత కళలు కనుమరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సంస్కృతి, సంప్రదాయాలకు మూలమైన ఆ అద్భుత కళల్ని కాపాడుకునే క్రమంలోనే కేంద్ర ప్రభుత్వం కళా దరోహర్ కార్యక్రమాన్ని రూపొందించిందన్నారు. విద్యార్థులకు వీటిపై సమగ్ర శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ప్రిన్సిపాల్ ఎన్.నరసింహారావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన నాలుగు జేఎన్‌వీల్లో మద్దిరాల ఉండటం సంతోషమన్నారు. తమ విద్యాలయంలోని 270 విద్యార్థులకు రెండు రోజులు పాటు అవగాహన, ప్రదర్శనల ద్వారా సమగ్ర శిక్షణ అందించినట్లు వివరించారు. హైదరాబాద్‌లోని సంగీత కళాశాల ప్రతినిధి ఎంఎస్ రావు, వాయిద్యా కళాకారులు శ్రీనివాసరావు, రఘురాం, అధ్యాపకులు రత్నాంబిక, ఉన్నారు.

క్లుప్తంగా

హెల్త్ వెల్‌సెంటర్లో వైద్యశాఖ అధికారుల తనిఖీ

ఏఎన్ఎంల, ఆశ వర్కర్ల పనితీరు, రికార్డులు పరిశీలన



ముస్సాపురం(పెదకూరపాడు): మండలంలోని ముస్సాపురం గ్రామంలోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను గురువారం వైద్యశాఖ జిల్లా అధికారులు గణాంక అధికారి నీలకంఠేశ్వరరావు, డీపీవోజీ పొన్నూరు బాషా, డీపీహెచ్ఎన్‌వో సురేఖ సందర్శించారు. ఈ సందర్భంగా వెల్‌నెస్ సెంటర్ ఏఎన్ఎంల, ఆశ వర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పీల రికార్డులు పరిశీలించారు. అనంతరం వైద్యసిబ్బంది ఏవిధంగా విధులు అప్‌డేట్‌గా ఉండాలో అవగాహన కల్పించారు. అనంతరం 75 త్యాళ్లూరులోని పీహెచ్‌సీ సందర్శించి అక్కడి వైద్యసిబ్బంది, అధికారులతో సమావేశం నిర్వహించారు. పనితీరు మెరుగుపరుచుకొనే సలహాలు, సూచనలు తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ వెలిగొండారెడ్డి, ఎంపీహెచ్ఈవో విజయ్‌కుమార్, అధికారులు దుర్గా, దిలీప్‌కుమార్, బి.శ్రీనివాసరావు, సుభాషిణి పాల్గొన్నారు.

కాపునాడు సేవా సమితి రాష్ట్ర కార్యదర్శిగా వట్టెం శ్రీనివాసరావు



చిలకలూరిపేట: ఏపీ రాష్ట్ర కాపునాడు సేవా సమితి రాష్ట్ర కార్యదర్శిగా పట్టణానికి చెందిన వట్టెం శ్రీనివాసరావు నియమితులయ్యారు. పట్టణంలోని కాపుభవన్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీనివాసరావుకు కాపునాడు సేవాసమితి జాతీయ అధ్యక్షుడు మల్లెల శివనాగేశ్వరరావు గురువారం నియామక పత్రం అందజేశారు. ఆయనకు సంఘ సభ్యులైన గోవిందు శంకర శ్రీనివాస్, తోట లక్ష్మీనారాయణ, చౌడవరపు రామారావు, తోట శ్రీనివాసరావు, తోట బ్రహ్మస్వాములు, అచ్చుకోల మురళి తదితరులు అభినందనలు తెలిపారు.

బుక్ చేసుకున్న రసీదుతో వచ్చేవారికే అనుమతి

- జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు
- ఇసుక రవాణా వాహనదారులకు సూచన



మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు, జేసీ సూరజ్ ధనుంజయ్

నరసరావుపేట: ఉచిత ఇసుక విధానంలో ఇసుక కావాల్సిన వ్యక్తులు ముందుగా తమ దగ్గరలోని సచివాలయంలో బుక్ చేసుకొని వారికి నిర్దేశించిన సమయంలో ఆ రసీదు తీసుకొని వచ్చే వారినే ర్యాంపు వద్దకు అనుమతిస్తామని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్పీ కె.శ్రీనివాసరావు స్పష్టం చేశారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం మాదిపాడు, కొండమోడు ర్యాంపుల్లోనే ఇసుక ఉందని చెప్పారు. భవిష్యత్ అవసరాలకు మరో ఐదు ర్యాంపులు గుర్తించామని, ఇసుకకు ఎక్కడా కొరత లేదని చెప్పారు. రోజుకు గరిష్టంగా ఒక్కొక్కరికి 20 టన్నులు మాత్రమే అందించటం జరుగుతుందన్నారు. ఇసుక పంపిణీలో అక్రమాలకు తావు లేకుండా పారదర్శకంగా అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోలీసులు, రవాణాశాఖ అధికారులు వాహనాల వ్యక్తులు ముందుగానే బుక్‌చేసుకున్నారా లేదా అనేది పరిశీలించి అనుమతిస్తారన్నారు. లోడింగ్ సమయంలో బుక్ చేసుకున్న మేరకే ఇసుక లోడు చేస్తున్నారా లేదా అనేది మరో అధికారి పరిశీలిస్తారన్నారు. మొత్తం మూడు స్టేజ్‌లలో ఈ ప్రక్రియను అధికారులు పరిశీలిస్తారన్నారు. ప్రభుత్వం ఇసుక ఉచితంగా ఇస్తున్నా రవాణా చార్జీల వల్ల ధర పెరిగిందనే భావన ప్రజల్లో ఉందన్నారు. దీనికి నోడల్ ఆఫీసర్‌గా జేసీ సూరజ్ ధనుంజయ్‌ను ప్రభుత్వం నియమించిందన్నారు. ఇసుక అక్రమంగా నిల్వ చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం సెప్టెంబరు 11వ తేదీన నూతన ఇసుక పాలసీ తీసుకురానుందని అన్నారు. అప్పటి నుంచి ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ మాదిపాడు ర్యాంపు వద్ద చెక్‌పోస్టు ఏర్పాటుచేశామన్నారు. ఇసుక కోసం వచ్చే వారు తప్పకుండా బుక్‌చేసుకున్న రసీదులతోనే ర్యాంపునకు వచ్చేందుకు అనుమతి ఇస్తామన్నారు. ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరుగంటల్లోపు మాత్రమే ఇసుక తరలింపుకు అనుమతిస్తామని తెలిపారు. సమావేశంలో జేసీ సూరజ్ ధనుంజయ్, జిల్లా రవాణా అధికారి టి.పరంధామరెడ్డి పాల్గొన్నారు.

గుంటూరు రేంజ్‌లో మరో 13 మంది సీఐలు బదిలీ

నగరంపాలెం: గుంటూరు రేంజ్ పరిధిలో మరో 13 మంది సీఐలను బదిలీ చేస్తూ గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి గురువారం ఉత్తర్వులు జారీచేశారు.

సీఐ పేరు	ప్రస్తుతం	బదిలీ
గన్నవరపు శ్రీనివాసరావు	పీటీసీ, ఒంగోలు	ప్రత్తిపాడు సర్కిల్, గుంటూరు జిల్లా
షేక్.నాగూర్‌మీరాసాహెబ్	ఇంటెలిజెన్స్	మేడికొండూరు పీఎస్, గుంటూరు జిల్లా
ఇ.నారాయణ	ఇంటెలిజెన్స్	దిశ-1, గుంటూరు జిల్లా
బి.బ్రహ్మయ్య	రేంజ్ వీఆర్, గుంటూరు	సత్తెనపల్లి టౌన్ పీఎస్, పల్నాడు జిల్లా
ఎం.హైమారావు	రేంజ్ వీఆర్, గుంటూరు	నరసరావుపేట 2 టౌన్ పీఎస్, పల్నాడు జిల్లా
ఆర్.సురేష్‌బాబు	ఎస్సీ, ఎస్టీ సెల్-1, ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా	రేపల్లె రూరల్ సర్కిల్, బాపట్ల జిల్లా
పీవీ ఆంజనేయులు	రేంజ్ వీఆర్, గుంటూరు	వేమూరు సర్కిల్, బాపట్ల జిల్లా
బి.నాగభూషణం	రేంజ్ వీఆర్, గుంటూరు	చీరాల 2 టౌన్ పీఎస్, బాపట్ల జిల్లా
షేక్.ఖాజావలి	మహిళా పీఎస్, ప్రకాశం జిల్లా	కనిగిరి సర్కిల్, ప్రకాశం జిల్లా
సీహెచ్.ప్రభాకర్‌రావు	రేంజ్ వీఆర్, గుంటూరు	ఎర్రగొండపాలెం సర్కిల్, ప్రకాశం జిల్లా
ఆర్ఎస్.కిషోర్‌కుమార్	మెరైన్	ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా 5 టౌన్ పీఎస్
బి.పాపారావు	రేంజ్ వీఆర్, గుంటూరు	కావలి రూరల్ సర్కిల్, ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా
జె.శ్రీనివాస్	రేంజ్ వీఆర్, గుంటూరు	గూడూరు 2 టౌన్ పీఎస్, తిరుపతి జిల్లా

లారీ ఢీకొని యువకుడి మృతి

మరో ఇద్దరికి గాయాలు



దాచేపల్లి: లారీ ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన గురువారం జరిగింది. దాచేపల్లి సమీపంలోని భవ్య పెట్రోల్ బంకు వద్ద జరిగిన ఈ ఘటనలో పిడుగురాళ్ల మండలం బ్రాహ్మణపల్లికి చెందిన కొండ్రు కోటయ్య, కోటేశ్వరిల పెద్ద కుమారుడు రామ్‌చరణ్ అలియాస్ సీమోను (17) మృత్యువాత పడ్డాడు. అదే గ్రామానికి చెందిన చిన్న వెంకయ్య, ఉదయ్ గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం బ్రాహ్మణపల్లి నుంచి ద్విచక్ర వాహనంపై సీమోను, చిన్న వెంకయ్య, ఉదయ్ వ్యక్తిగత పనుల నిమిత్తం దాచేపల్లి వస్తున్నారు. భవ్య పెట్రోల్ బంకు సమీపంలో ముందు వెళుతున్న లారీని దాటే క్రమంలో లారీ రోడ్డుమార్జిన్ వైపుగా దూసుకురావటంతో ద్విచక్ర వాహనం పక్కకి తప్పిస్తుండగా లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో రామ్‌చరణ్ ఘటన స్థలంలోనే మృతి చెందాడు. చిన్న వెంకయ్య, ఉదయ్‌కి గాయాలు కావడంతో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి తండ్రి కోటయ్య ఏడాది క్రితమే అనారోగ్యంతో మృతి చెందాడు. రామ్‌చరణ్ కూలీ పనులు చేసుకుంటూ తల్లికి చేదోడుగా ఉంటూ కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. ఘటన స్థలాన్ని ఎస్ఐ జి.సంధ్యారాణి పరిశీలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శిగా కరీముల్లా

పిట్టలవానిపాలెం: బాపట్ల జిల్లా స్కూల్ గేమ్స్ నూతన కార్యదర్శిగా ఖాజీపాలెం మంతెన సుబ్బరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు కరీముల్లా ఎంపిక అయ్యారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి నారాయణరావు, డిప్యూటీ డీఈఓ వెంకటేశ్వర్లు ఉత్తర్వులు అందజేశారు. 28 సంవత్సరాలుగా నిజాంపట్నం, పెదపులివర్రు, చింతాయపాలెం, చందోలు, బెల్లంకొండ, అమర్తలూరు, మాచవరం, ఖాజీపాలెం ఉన్నత పాఠశాలల్లో ఎంతో మంది విద్యార్థులను ఆయన తీర్చిదిద్దారు. జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనేలా కృషి చేశారు. రాష్ట్ర స్థాయిలో పాఠశాల విద్యాశాఖ నిర్వహించిన వ్యాయామ అక్షరాస్యతలో పాల్గొని 6,7,8 తరగతుల పాఠ్యాంశాలను రచించారు. ఆయన ప్రతిభ, అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని బాపట్ల జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శిగా ఎంపిక చేశామని అధికారులు తెలిపారు. వాలీబాల్, కబడీ, బాల్‌బ్యాడ్మింటన్, ఖోఖో, అథ్లెటిక్స్‌లో కరీముల్లా శిక్షణ ఇస్తున్నారు. జిల్లాను పాఠశాల క్రీడలలో రాష్ట్ర స్థాయిలో ప్రథమస్థానంలో నిలిపేలా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భూపతిరావు, తిరుపతిరావు, కత్తి శ్రీను, కృష్ణ ప్రసాద్, రవిరాజు, దేవరాజు, మాజీ ఎస్‌జీపీ సెక్రెటరీ విష్ణు తదితరులు కరీముల్లాను అభినందించారు.

రాత్రిపూట నేరాలు అదుపులోకి రావాలి

- చోరీలకు పాల్పడుతున్న వారిని గుర్తించండి
- శాంతి భద్రతలు కాపాడటమే మనందరి ధ్యేయం
- ఎస్పీ కంచి శ్రీనివాసరావు



నేరసమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట: రాత్రిపూట నేరాలను అదుపు చేయాలని, చోరీలకు పాల్పడుతున్న వారిని గుర్తించి వెంటనే అరెస్టు చేయాలని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశించారు. గురువారం ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలో నేర సమీక్ష నిర్వహించారు. పెండింగ్ కేసులతో పాటు నెలరోజులుగా నమోదైన కేసులు, వాటి పరిష్కారంపై స్టేషన్లవారీగా సమీక్షించారు. శాంతి భద్రతలను కాపాడటమే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని కోరారు. అలాగే నేరం చేసిన వ్యక్తులు సరైన సాక్ష్యం లేకుండా తప్పించుకోకుండా న్యాయస్థానాల్లో సాక్షులను ప్రవేశపెట్టి నిందితులకు శిక్షలు పడే విధంగా చేయాలని ఆదేశించారు. అలాగే పట్టణాల్లో ట్రాఫిక్‌పై కూడా దృష్టి సారించాలని అన్నారు. ఇసుక అక్రమ రవాణాను నివారించాలని, నేరస్తులు నేరాలు చేసేందుకు భయపడేలా వ్యవహరించాలని సూచించారు. సమావేశంలో జిల్లా శాంతిభద్రతల అదనపు ఎస్పీ సీహెచ్.లక్ష్మీపతి, ఏఆర్ అదనపు ఎస్పీ రామచంద్రరాజు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

బుధ-శనివారాల్లో చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు

శిక్షణను ప్రారంభించిన డీఎంహెచ్‌వో డాక్టర్ రవి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రవి

నరసరావుపేట: జిల్లాలో 11 రకాల ప్రాణాంతక వ్యాధుల నుంచి చిన్నారులను రక్షించేందుకు పది రకాల వ్యాధి నిరోధక టీకాలు అన్నీ సచివాలయాల్లో ప్రతి బుధ, శనివారాల్లో ఇవ్వనున్నట్లు జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి పేర్కొన్నారు. జిల్లా వైద్యశాఖాధి కార్యాలయంలో గురువారం వైద్యాధికారులు, పర్యవేక్షకులకు ఏర్పాటు చేసిన సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాలపై శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, చిన్నారులు ఆరోగ్య సిబ్బంది సూచించిన విధంగా వ్యాధినిరోధక టీకాలు తీసుకొని తమ బిడ్డలను ప్రాణాంతక వ్యాధుల నుంచి కాపాడుకోవాలని సూచించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వేలెన్సు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మౌనిక మాట్లాడుతూ సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాలు నిల్వచేసే విధానం గురించి, టీకా ఇచ్చిన అనంతరం కలిగే దుష్పరిణామాలను గురించి, వాటిని ఏవిధంగా నిర్వహించాలో తెలియజేశారు. అలాగే ఆరోగ్య కేంద్ర పరిధిలో హైరిస్క్ ఏరియాలైన పట్టణ మురికివాడలు, ఇటుక తయారీ బట్టీలు, సంచార జాతులు నివసించే ప్రదేశాలలో ఉన్నవారిని గుర్తించి వారందరికీ తప్పనిసరిగా టీకాలు ఇప్పించాలని కోరారు. సమావేశంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ బి.గీతాంజలి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.పద్మావతి పాల్గొన్నారు.

రేపటి నుంచి రాష్ట్రస్థాయి క్యారమ్స్ పోటీలు

చిలకలూరిపేట సీఆర్ క్లబ్‌లో ఏర్పాట్లు



మాట్లాడుతున్న షేక్ అబ్దుల్ జలీల్

చిలకలూరిపేట: ఏపీ స్టేట్ శ్రీగిరిరాజు కృష్ణమూర్తి మెమోరియల్ సెకండ్ ర్యాకింగ్ క్యారమ్స్ రాష్ట్రస్థాయి పోటీలు ఈ నెల 24, 25 తేదీలలో చిలకలూరిపేటలోని సీఆర్ క్లబ్‌లో నిర్వహిస్తున్నట్లు స్టేట్ క్యారమ్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ జలీల్ తెలిపారు. ఏపీ స్టేట్ క్యారమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీఆర్ క్లబ్ ప్రాంగణంలో గురువారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయస్థాయి పోటీలకు క్యారమ్స్ క్రీడాకారులను ఎంపిక చేసేందుకు ఈ పోటీలు నిర్వహిస్తునట్లు తెలిపారు. పోటీలు పురుషులు, స్త్రీల విభాగంలో విడివిడిగా కొనసాగుతాయన్నారు. జాతీయస్థాయి క్యారమ్స్ క్రీడాకారులైన జనార్ధన్ రెడ్డి, వైఎస్‌డీ రమేష్, ఎంఎస్‌కే హారిక, గిన్నిస్ బుక్ రికార్డు హోల్డర్ ఎస్‌కే హుస్నా సమీర వంటి మేటి క్రీడాకారులతో పాటు మొత్తం 160 మంది క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. పోటీలకు చీఫ్ రిఫరీగా డీఎస్ఆర్ మూర్తి, అసిస్టెంట్ చీఫ్ రిఫరీగా ఎండీ సిరాజ్ అహమ్మద్, మరో 8 మంది రిఫరీలుగా వ్యవహరిస్తారన్నారు. పోటీలకు అబ్జర్వర్‌గా జె.మురళీకృష్ణ వ్యవహరిస్తారన్నారు. పురుషుల విభాగంలో నాలుగు బహుమతులు, స్త్రీ విభాగంలో రెండు బహుమతులు అందజేస్తామన్నారు. సమావేశంలో క్యారమ్స్ అసోసియేషన్ పల్నాడు జిల్లా కార్యదర్శి బోయపాటి రవితేజ, అధ్యక్షుడు చల్లగుండ్ల అజేయ్‌బాబు, టోర్నమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్వీ రమణమూర్తి, సీఆర్ క్లబ్ ఉపాధ్యక్షుడు చెరుకూరి కాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటడం అందరి బాధ్యత

జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ గంగవరపు జోసఫ్ కుమార్



మండల పరిషత్ కార్యాలయంలో మొక్క నాటుతున్న జోసఫ్ కుమార్

రొంపిచర్ల: మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా నీటి యాజమాన్య సంస్థ డైరెక్టర్ గంగవరపు జోసఫ్ కుమార్ అన్నారు. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో 'ప్లాంట్ ఫర్ మదర్' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ గంగవరపు జోసఫ్ కుమార్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని మండల పరిషత్ కార్యాలయాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టటం జరిగిందన్నారు. తల్లికోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి బాధ్యతగా పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నిర్మల, ఎంపీడీఓ కె.మ్యాథ్యూబాబు, లక్ష్మీకుమారి, మాజీ సర్పంచ్ చక్రారెడ్డి, మాజీ ఎంపీపీ రామారావు, ఉపాధి హామీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో ఎరువులు పుష్కలం

జిల్లా వ్యవసాధికారి మురళి



గోడౌన్‌లో ఎరువుల నిల్వలను తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మురళి

నరసరావుపేట: జిల్లాలో రైతుల అవసరాలకు తగిన విధంగా ఎరువులు ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని షాపుల్లో ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్-2024కు జిల్లాలో 2,49,350 హెక్టర్లలో వివిధ రకాల పంటలు సాగుచేస్తారని అంచనా వేస్తున్నామన్నారు. అలాగే జిల్లాలో సాధారణ వర్షపాతానికి మించి 314.5 సెం.మీటర్ల వర్షం కురిసిందన్నారు. నాగార్జునసాగర్‌లో 309 టీఎంసీల నీరు లభ్యత ఉందన్నారు. ప్రస్తుతం ప్రత్తి 49,735 హెక్టార్లు సాగులో ఉండగా మిరప, వరి నారుమళ్ల దశలో ఉందన్నారు. ఖరీఫ్ పంటకాలానికి 99,370 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని అంచనా వేసి దీనికి అనుగుణంగా నెలవారీ సరఫరా ప్రణాళికలో భాగంగా ఆగస్టు వరకు 53,392 మెట్రిక్ టన్నులు అవసరమౌతాయని అంచనా వేయటం జరిగిందన్నారు. మరో 10 వేల టన్నుల డీఏపీ, ఎనిమిది వేల మెట్రిక్ టన్నుల యూరియా, ఇతర ఎరువులు అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. సరఫరాలో ఏదైనా సమస్యలు ఎదురైతే రైతు సేవా కేంద్రాల ద్వారా వ్యవసాయాధికారి, ఏడీఏలు, జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేయబడిన కాల్ సెంటర్ 83310 56915కు తెలియచేస్తే పరిష్కరిస్తామని వివరించారు. ఎరువుల నిల్వల పరిశీలనలో ఏడీఏ మస్తానమ్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఏపీ స్టేట్ పికిల్ బాల్ రాష్ట్రస్థాయి పోటీలు



పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఏపీ స్టేట్ పికిల్ బాల్ అసోసియేషన్, వీవీవీ హెల్త్ క్లబ్ సంయుక్తాధ్వర్యంలో ఏపీ స్టేట్ పికిల్ బాల్ చాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయని టోర్నమెంట్ నిర్వాహక కార్యదర్శి టి.అరుణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు ఈ నెల 31, సెప్టెంబర్ 1 తేదీల్లో స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులోని హనుమాన్ నగర్ 1వ లైన్‌లో నిర్వహిస్తామని తెలిపారు. అండర్-14, 19 బాలుర సింగిల్స్‌తోపాటు 35+, 50+ పురుషుల విభాగంలో సింగిల్స్, డబుల్స్‌లలో పోటీలు ఏర్పాటు చేశామని చెప్పారు. అనంతరం టోర్నమెంట్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించామని తెలిపారు.

రైతు సేవాకేంద్రాల్లో ఎరువులు ఏవీ?

రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి

తెనాలి: రైతు సేవాకేంద్రాల ద్వారా డీఏపీ తదితర ఎరువులను అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంటకాల్వలకు పుష్కలంగా నీరు వస్తున్న తరుణంలో రైతు సేవా కేంద్రాల్లో డీఏపీ ఎరువులు లభ్యంకాక రైతులు ఇబ్బంది పడుతున్నట్టు తెలియజేశారు. ప్రైవేటు వ్యాపారులకు, సొసైటీలకు ఎరువులను కేటాయించిన ప్రభుత్వం, రైతు సేవాకేంద్రాలకు కేటాయింపులు ఇవ్వక పోవటం శోచనీయమన్నారు. ఇదే అదనుగా ప్రైవేటు వ్యాపారులు బస్తాకు రూ.50 అదనంగా వసూలుచేస్తున్నట్టు రైతులు ఆందోళన చెందుతున్నారని శివసాంబిరెడ్డి తెలిపారు. తెనాలి, పరిసర గ్రామాల రైతులు బాపట్ల జిల్లా చుండూరు మండలం వలివేరు సొసైటీకి వెళ్లి ఎరువులు తెచ్చుకుంటున్నారని, ఇప్పటికైనా ప్రభుత్వం అన్ని రైతుసేవాకేంద్రాలకు అవసరమైన ఎరువులను కేటాయించాలని విజ్ఞప్తిచేశారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తు చేసుకోండి

డీఈఓ వెంకటేశ్వర్లు

నరసరావుపేట ఈస్ట్: జిల్లా పరిధిలోని అర్హులైన ఉపాధ్యాయులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ-2024 అవార్డుకు ఈనెల 25వతేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. జిల్లాలోని ప్రైవేటు యాజమాన్యంలో పనిచేసే పాఠశాలల ఉపాధ్యాయులు మినహా మిగిలిన అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 15 సంవత్సరాల బోధనానుభవం ఉన్న ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. తమ దరఖాస్తులను ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు మండల విద్యాశాఖాధికారి కార్యాలయం, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు డిప్యూటీ డీఈఓకు అందచేయాలని తెలిపారు. ఎంపికైన ఉపాధ్యాయులను సెప్టెంబర్ 5వతేదీన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని సత్కరించనున్నట్టు వివరించారు.

వినుకొండ కమిషనర్‌గా సుభాష్ చంద్రబోస్



వినుకొండ(నూజెండ్ల): పట్టణ మున్సిపల్ కమిషనర్‌గా ఎం.సుభాష్ చంద్రబోస్ నియమితులయ్యారు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట కమిషనర్‌గా ఉన్న ఆయన బదిలీల్లో భాగంగా వినుకొండకు బదిలీ అయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న కృష్ణవేణిని నిడదవోలుకు బదిలీ చేశారు.

ఫార్మా కార్మికుల మృతి బాధాకరం

- మృతుల కుటుంబాలను ఆదుకోవాలి
- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు



వినుకొండ (నూజెండ్ల): అచ్చుతాపురంలో ఫార్మాకంపెనీలో భారీ పేలుడు సంభవించి 17 మంది కార్మికులు మృతి చెందడం దురదృష్టకరమని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. పేలుడు సంఘటనపై యాజమాన్య నిర్లక్ష్యమైతే ప్రభుత్వం వెంటనే తగు చర్యలు తీసుకొని మృతుల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా దేశవ్యాప్తంగా మహిళలు, బాలికలు, మహిళా డాక్టర్లపై మానవ మృగాలుగా ప్రవర్తిస్తున్న వారిపై నిర్భయ చట్టం కఠినంగా అమలు చేయాలని, చట్టం ఉన్నప్పటికీ మానవ మృగాలలో ఎటువంటి మార్పు రావడం లేదన్నారు. సినిమాల్లో, టీవీల్లో అశ్లీల దృశ్యాలు నియంత్రించాలన్నారు. తల్లికి, చెల్లికి వందనం అనే అంశంపై పాఠ్యాంశాల్లో గౌరవం కల్పించే విధంగా చేయాలన్నారు. వికృత సంస్కృతిపై పోలీస్ వ్యవస్థ ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పల్నాడు జిల్లా సీపీఐ కార్యదర్శి ఎ.మారుతి వరప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా భూ బాధితుల సమస్యలపై ఈ నెల 28న విజయవాడలో రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహిస్తున్నామన్నారు.

పొన్నూరు మున్సిపల్ కమిషనర్ నయీం బదిలీ

నూతన కమిషనర్‌గా రమేష్‌బాబు

పొన్నూరు: పొన్నూరు మున్సిపల్ కమిషనర్ సీఎంఏ నయీం అహ్మద్‌ను డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో రిపోర్టు చేయమని గురువారం డీఎంఏ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆయన స్థానంలో కమిషనర్‌గా శ్రీకాళహస్తి మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.రమేష్‌బాబు పొన్నూరుకు రానున్నారు.